కొచ్చెరువుకు మరమ్మతులెప్పుడో?

- తాగు, సాగు నీరుకు ఆధారం చెరువు
- వర్షాలకు కోతకు గురైన వైనం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- మరమ్మతులు చేయాలంటున్న ప్రజలు


గంభీర్‌పూర్ శివారులో కోతకు గురైన కొచ్చెరువు

కథలాపూర్: ఆ చెరువులో నీళ్లుంటే తాగు, సాగు నీరుకు ఢోకా ఉండదని ఆ గ్రామస్తుల నమ్మకం. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు ఆధారమైన చెరువుకు గండ్లు పడి నీరంతా వృథాగా పోయింది. చెరువు కట్ట కోతకు గురికాగా మత్తడి ప్రమాదకరంగా మారింది. తమ ఊరికి ఆధారమైన కొచ్చెరువును త్వరగా మరమ్మతులు చేయించాలని కథలాపూర్ మండలం గంభీర్‌పూర్ గ్రామస్తులు కోరుతున్నారు.

గంభీర్‌పూర్‌కు ఆధారం కొచ్చెరువు..

కథలాపూర్ మండలం గంభీర్‌పూర్‌లో 1,120 కుటుంబాలుండగా, 4,500 జనాభా ఉంది. గ్రామానికి తలాపున కొచ్చెరువు ఉంది. ఈ చెరువు సుమారు 30 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఈ చెరువులో పుష్కలంగా నీళ్లుంటే గ్రామంలోని బోరుబావుల్లో, చేతిబావుల్లో పుష్కలంగా నీళ్లుంటాయి. గ్రామ శివారులో భూగర్భజలాలు పెరుగుతాయని స్థానికులు పేర్కొన్నారు. కొచ్చెరువులో నీళ్లుంటే తాగు, సాగునీటికి సమస్య ఉండదని గ్రామస్తులు అంటున్నారు. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు కొచ్చెరువు కట్ట కోతకు గురై నీరంతా వృథాగా పోయింది. మత్తడి సైతం ధ్వంసమైంది. ప్రస్తుతం ఈ చెరువులో చుక్కనీరు కనిపించడంలేదు. చెరువులో చుక్క నీరు లేకపోవడంతో గ్రామ శివారులోని పలువురి రైతుల బావుల్లో నీళ్ల అడుగంటిపోగా.. బోరుబావులు మోటార్లతో నీళ్ల వేగంగా రావడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే వేసవిలో గ్రామంలోని బోరుబావులు, చేదబావులు ఎండిపోవడం ఖాయమని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. యాసంగిలో పంటలు సాగు చేసుడు కష్టమేనని ఆయకట్టు రైతులు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి కొచ్చెరువుకు త్వరగా మరమ్మతులు చేయిస్తే కురిసే వర్షాలకు చెరువులో నీళ్లు చేరుతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. లేకపోతే గ్రామం పరిధిలో తాగు, సాగునీరు లేక తల్లడిల్లే పరిస్థితి ఉంటుందన్నారు.

నీళ్లు అడుగంటిపోయాయి



కొచ్చెరువుకు దగ్గర వ్యవసాయ బావి ఉంటుంది. ఆ బావిపై ఆధారపడి ప్రతీ ఏటా 3 ఎకరాల్లో వరి పంట సాగుచేస్తున్నా.. ఈసారి కూడా వరి సాగు చేసిన. వర్షాలకు చెరువు తెగి నీళ్ల వెళ్లిపోయాయి. మా బావిలో నీళ్ల అడుగంటాయి. వరి పంటకు నీళ్లందడం కష్టంగా మారింది. పెట్టుబడి కూడా వృథా అయ్యేట్లు ఉంది. చెరువును త్వరగా మరమ్మతులు చేయించాలి.

– మొగుళ్ల మల్లేశం, రైతు, గంభీర్‌పూర్

మరమ్మతు చేస్తేనే ప్రయోజనం



మా ఊరికి తలాపున కొచ్చెరువు ఉంది. అందులో నీళ్లుంటే ఎండకాలంలో గ్రామంలోని బోరుబావుల్లో నీళ్లుంటాయి. ప్రజలకు నీటి సమస్య ఉండదు. అలాంటిది కొచ్చెరువు వర్షాలకు కోతకు గురైంది. చెరువును త్వరగా మరమ్మతులు చేయిస్తే ఇప్పుడు కురిసే వర్షాలకు అందులో నీళ్ల చేరుతాయి. లేకపోతే గ్రామంలో నీటి కోసం ప్రజలు ఇబ్బందిపడుతారు. అధికారులు చొరవ చూపాలి.

– నస్కూరి భాస్కర్, గ్రామస్తుడు, గంభీర్‌పూర్

ప్రతిపాదనలు పంపాం



భారీ వర్షాలతో గంభీర్‌పూర్ శివారులోని కొచ్చెరువు కట్ట, మత్తడి ధ్వంసమైంది. చెరువును మరమ్మతు చేసేందుకు ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించాం. ఏ ఏ పనులు చేయించాలనే విషయంలో అధికారులతో చర్చించాం. సుమారు రూ. 60 లక్షలతో ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు మంజూరు కాగానే చెరువును మరమ్మతులు చేయిస్తాం.

– ప్రశాంత్, నీటిపారుదలశాఖ,డీఈ

గృహలక్ష్మి పథకానికి అర్హులు 890 మంది


దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్న సిబ్బంది

పెగడపల్లి: గృహలక్ష్మి పథకంలో ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి మూడు విడతలుగా రూ. 3 లక్షల ఆర్థిక సాయం అందించనుంది. దీని కోసం పెగడపల్లి మండలంలో లబ్ధిదారుల నుంచి ఈ నెల 7 నుంచి 10 వరకు దరఖాస్తులు స్వీకరించారు. నియోజకవర్గానికి సుమారు 3 వేల ఇళ్ల చొప్పున మంజూరు చేసేందుకు నిర్ణయించగా పెగడపల్లి మండలానికి సుమారు నాలుగు వందల ఇళ్ల వరకు కేటాయించనున్నారు. అయితే ప్రభుత్వం అనుకున్న దానికంటే ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. వచ్చిన దరఖాస్తులను ఈ నెల 11 నుంచి 20 వరకు ఎంపీడీవోలు, ఎంపీవోలు, తహసీల్దార్లు, ఆర్‌ఐలు వివరాలు సేకరించారు. మండలంలో 1256 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 890 దరఖాస్తుదారులను అర్హులుగా గుర్తించారు. కాగా ఈ విషయమై ఎంపీడీవో పుల్లయ్య మాట్లాడుతూ గృహలక్ష్మి పథకం కింద దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ, ఈనెల 25 తరువాత ఉన్నతాధికారులు అర్హులను ఎంపిక చేసే అవకాశముంది. పైరవీలకు తావు లేకుండా పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరుగనుంది. మొదటి విడతలో మంజూరు కానీ వారికి రెండో విడతలో మంజూరయ్యే అవకాశం ఉంటుందన్నారు.

మంత్రి ఈశ్వర్‌కు శుభాకాంక్షల వెల్లువ


మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

పెగడపల్లి: ధర్మపురి నుంచి మరోసారి బీఆర్‌ఎస్ నుంచి మంత్రి ఈశ్వర్‌ను అధిష్టానం ఎంపిక చేయడంతో పెగడపల్లిలో బీఆర్‌ఎస్ నాయకుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. మండలంలోని పలు గ్రామాల్లో వివిధ కారణాలతో పలువురు మృతి చెందగా, బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు మంగళవారం మండలానికి వచ్చిన మంత్రి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలను కలిశారు. మంత్రికి మండల బీఆర్‌ఎస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి, వెంకన్న, అడ్వైజరీ కమిటీ కన్వీనర్ ఆనందం, నాయకులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన పద్మశాలీ నాయకులు


రేవంత్ రెడ్డికి తీర్మాన కాపీ ఇస్తున్న నాయకులు

కోరుట్ల: పద్మశాలీ యుద్ధభేరి తీర్మానం మేరకు పద్మశాలీ అభ్యర్థులకు తగిన ప్రాధాన్యం ఇచ్చి టిక్కెట్లు కేటాయించాలని మంగళవారం హైదరాబాద్ గాంధీ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, తెలంగాణ పార్టీ ఇన్‌చార్జీ మాణిక్ రావ్ ఠాకూర్, ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీలను రాష్ట్ర పద్మశాలీ సంఘం నాయకులు కోరారు. అనంతరం యుద్ధభేరి రాజకీయ తీర్మాణాల ప్రతులను అందించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామ శ్రీనివాస్, యుద్ధభేరి సభాధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే ఈరవత్రిని అనిల్, బాలరాజు, అప్పం శ్రీనివాస్, కాటికారి రాజ్‌కుమార్, గంజి శ్రీనివాస్, కేసుల సురేందర్ ఉన్నారు.

కొండగట్టులో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పూజలు


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, నాయకులు

కొండగట్టు: చొప్పదండి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా సీఎం ప్రకటించడంతో మంగళవారం కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి వారిని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆయన గోత్రానామాలపై ప్రత్యేక పూజలు జరిపారు. చొప్పదండి ఎస్సీ నియోజకవర్గం ఏర్పడ్డాక ఒకే పార్టీ నుంచి రెండుసార్లు టిక్కెట్ సాధించిన ఘనత సాధించారని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. కార్యక్రమంలో సర్పంచులు బద్దం తిరుపతిరెడ్డి మిట్టపెల్లి సుదర్శన్, పునుగోటి కృష్ణారావు, కొడిమ్యాల పీఏసీఎస్ చైర్మన్ మేనేని రాజనర్సింగరావు, నాయకులు జనగం శ్రీనివాస్, ఐల్నేని సాగర్‌రావు, నరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణ కోసం షీటీం నిరంతర కృషి

జగిత్యాలక్రైం: మహిళల రక్షణ కోసం షీటీం నిరంతర కృషి చేస్తుందని షీటీం ఎస్సై వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎస్‌ఎస్వీ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై జరిగే నేరాలపై వెంటనే బాధితులు పోలీసులను సంప్రదించాలని, మహిళల రక్షణకు, వారిపై జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు షీటీం నిరంతరం పనిచేస్తుందన్నారు. మహిళలు యువతులు ఎలాంటి సమస్య ఉన్నా నిర్భయంగా షీటీం నంబరు 8712670783కి సంప్రదించాలన్నారు. టోల్‌ఫ్రీ నంబరు 1930, లేదా డయల్ 100కు కాల్ చేసి సమాచారం అందించాలని అన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై అలీబేగ్, మహిళా కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ప్రతిభతోనే విజయం

జగిత్యాల: ప్రతిభతోనే విజయం వరిస్తుందని మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ అన్నారు. ఇటీవల విడుదలైన పీజీ ఎంట్రెన్స్ ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థినులకు అభినందనలు తెలిపారు. కళాశాలలో మెరుగైన విద్యతో పాటు, విద్యార్థులకు అన్ని రకాల సేవలందిస్తున్నామన్నారు.ర్యాంకులు సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పడాల తిరుపతి, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పీఆర్‌సీ కమిషన్ నియమించి ఐఆర్ ప్రకటించాలి

కోరుట్ల రూరల్: ఉపాధ్యాయులకు పీఆర్‌సీ కమిషన్ నియమించి ఐఆర్‌ను తక్షణమే ప్రకటించాలని టీయస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి భూమేశ్వర్ అన్నారు. మండలంలోని పాఠశాలల్లో మంగళవారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మాట్లాడారు. ప్రస్తుత ధరలకు అనుగుణంగా ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు సిరిపురం శ్రీనివాస్, కోరుట్ల మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెల్మల రాజేశ్వర్ రెడ్డి,మాసం చిరంజీవి పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా యాదగిరిబాబు

మెట్‌పల్లి: బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పట్టణానికి చెందిన రాచకొండ యాదగిరిబాబును నియమించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తన నియామకానికి సహకరించిన ఎంపీ అర్వింద్, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పద్మశాలీ సంఘం రాష్ట్ర కార్యదర్శికి సన్మానం

కోరుట్ల: అఖిల భారత పద్మశాలీ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా కోరుట్ల మాజీ కౌన్సిలర్ జక్కుల జగదీశ్వర్ నియమితులు కాగా, స్థానిక పద్మశాలీ సంఘం నాయకులు మంగళవారం ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు జక్కుల ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్సుపాసులు పంపిణీ

సారంగాపూర్: మండలంలోని ఒడ్డెరకాలనీలో మంగళవారం దివ్యాంగులకు ఆర్టీసీ ఉచిత ప్రయాణ బస్సు పాసులను అందించారు. సర్పంచ్ పల్లపు వెంకటేశ్, ఆర్టీసీ డీఎం నర్సప్ప, ఉపసర్పంచ్ పోగుల మాధవి తదితరులు ఉన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

మేడిపెల్లి: మండలంలోని పోరుమల్లలో చల్మెడ ఆనందరావు వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి చల్మెడ నరసింహారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీజేపీలో ప్రాధాన్యం లేదని ఫిర్యాదు


కిషన్‌రెడ్డిని కలిసిన బీజేపీ నాయకులు

కొండగట్టు: 30 ఏళ్లుగా పార్టీలో పనిచేస్తున్నా.. గుర్తింపు దక్కడం లేదని చొప్పదండి నియోజకవర్గంలోని బీజేపీ సీనియర్ నాయకులు రాష్ట్ర అధ్యక్షుడికి ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌లో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని కలిసి నల్లగొండ లక్ష్మీనరసింహ స్వామి చిత్రపటం అందించారు. నియోజకవర్గ, జిల్లా పార్లమెంట్ నాయకులు తమ ప్రాంతాల్లో జరిగే కార్యక్రమాలకు తమకు సమాచారం ఇవ్వడం లేదని, అసలు పట్టించుకోవడం లేదని తెలిపారు. ఇలానే ఉంటే రానున్న రోజుల్లో పార్టీని వీడే పరిస్థితి ఉంటుదని కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కిషన్‌రెడ్డిని కలిసిన వారిలో నాయకులు లింగంపెల్లి శంకర్ మెరుగు కిషన్ గౌడ్ రవిందర్ బూస గంగాధర్ కృష్ణ దేవేందర్ తదితరులు ఉన్నారు.

కుటుంబపాలనను అంతమొందించాలి

- యూపీ ఎమ్మెల్యే పీఎన్ పాఠక్


మాట్లాడుతున్న యూపీ ఎమ్మెల్యే పీఎన్ పాఠక్

బుగ్గారం: రాష్ట్రంలో కుటుంబ పాలనను అంతమొందించడానికి ప్రతీ ఒక్క కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని ఉత్తరప్రదేశ్ ఖుషీ నగర్ ఎమ్మెల్యే పీఎన్ పాఠక్ అన్నారు. ఎమ్మెల్యే ప్రవాస్ అభియాన్‌లో భాగంగా బుగ్గారం మండల బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించారు. అనంతరం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో అవినీతి రహిత పాలన తేవడానికి, బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి కార్యకర్తలందరూ రాబోవు వందరోజులు కష్టించి పనిచేయాలని సూచించారు. కేంద్రంలో బీజేపీ అవినీతిరహిత, పారదర్శకతతో కూడిన పాలనను అందిస్తోందని అన్నారు. అలాగే సంపర్క్ మే సమర్థన్‌లో భాగంగా గోపులాపూర్ మాజీ సర్పంచ్ బల్మూరి రామారావును కలిసి కేంద్ర ప్రభుత్వ పనితీరును వివరించి మోడీ నాయకత్వాన్ని సమర్థించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మెడవేణి శ్రీధర్, ధర్మపురి అసెంబ్లీ కన్వీనర్ కూస్తూరి సత్యం, జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

బీర్‌పూర్ లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

సారంగాపూర్: బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామిని ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని కుషినగర్ ఎమ్మెల్యే పీఎన్ పాఠక్ మంగళవారం రాత్రి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ధర్మపురి నియోజవర్గ ఇన్‌చార్జీగా కొనసాగుతున్న ఎమ్మెల్యే ఆలయంలో పూజలు నిర్వహించగా, అర్చకులు ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు ఆడెపు రమేష్, అప్పాల జలేంధర్, సంతోష్, రాకేష్, పల్లి శ్రీనివాస్, కస్తూరి సత్యం ఉన్నారు.

కేంద్ర సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి


మాట్లాడుతున్న కర్ణాటక ఎమ్మెల్సీ పాటిల్

జగిత్యాలరూరల్: కేంద్ర సంక్షేమ పథకాలను ప్రజలకు ప్రతి కార్యకర్త ఇంటింటా వివరించాలని కర్నాటక ఎమ్మెల్సీ బీజీ.పాటిల్ అన్నారు. మంగళవారం జగిత్యాల అర్బన్ మండలం పెర్కపల్లిలోని భాగ్యరాజ్ ఫంక్షన్‌హాల్‌లో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోడీ నిరుపేదల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తే రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుంచుతామని, కార్యకర్తలంతా సమష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణరావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ బోగ శ్రావణి, అసెంబ్లీ కన్వీనర్ మదన్ మోహన్, బీజేపీ నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి, సుంకెటి దశరథరెడ్డి, కొక్కు గంగాధర్, గణేశ్, పడాల తిరుపతి, జున్ను రాజేందర్ పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బసవరాజు ముత్తు

మల్యాల: బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని కర్ణాటక ఎమ్మెల్యే బసవరాజు ముత్తు అన్నారు. మల్యాల మండల కేంద్రంలో బీజేపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. బీజేపీ పాలనలో చేపట్టిన అభివృద్ధిని గడప గడపకు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుద్దాల దేవయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ రావు, బింగి వేణు,శ్రావణ్, మండల ఆధ్యక్షుడు నేరెళ్ల శ్రావణ్, ఎంపీటీసీ అనిత, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కార్యకర్తలు భారీగా తరలిరావాలి

మెట్‌పల్లి రూరల్: కోరుట్ల నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా కల్వకుంట్ల సంజయ్‌ను సీఎం కేసీఆర్ ప్రకటించిన తర్వాత బుధవారం మొదటిసారిగా నియోజకవర్గానికి విచ్చేస్తున్న సందర్భంగా సంజయ్‌కు స్వాగతం పలికేందుకు బీఆర్‌ఎస్ కార్యకర్తలు భారీగా తరలిరావాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు,మెట్‌పల్లి ఎంపీపీ మారు సాయిరెడ్డి అన్నారు.జిల్లా సరిహద్దు శివారులోని గండిహనుమాన్ ఆలయం వద్దకు స్వాగతం పలికేందుకు మెట్‌పల్లి మండల ప్రజాప్రతినిధులు, నాయకులు బుధవారం పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం భారీ ర్యాలీతో కోరుట్లకు తరలివెళ్లనున్నట్లు తెలిపారు

డీఎస్పీ ఆవిర్భావ సభకు తరలిరావాలి

కథలాపూర్: ధర్మ సమాజ్ పార్టీ(డీఎస్పీ) ఆవిర్భావ సభ మంగళవారం జగిత్యాలలో నిర్వహిస్తున్నామని, కార్యకర్తలు అధికసంఖ్యలో తరలిరావాలని ఆ పార్టీ మండల కన్వీనర్ పొడేటి రమేశ్ కోరారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు సభకు హాజరై విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

‘గడపగడపకూ కాంగ్రెస్’

కొండగట్టు: కొడిమ్యాల మండలం దమ్మయ్యపేట, కోనాపూర్ గ్రామాల్లో మంగళవారం గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేడిపెల్లి సత్యం ఇంటింటా ప్రచారం చేశారు. నాయకులు పాల్గొన్నారు.

సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలి

సారంగాపూర్: ప్రభుత్వం వెంటనే సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలని బీసీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు బాస నాగేందర్, ప్రధానకార్యదర్శి పి.మల్లేశ్ మాట్లాడుతూ రెండో ఏఎన్‌ఎంలు ప్రభుత్వం నిర్దేశించిన దాని కంటే ఎక్కువ పనులు చేస్తున్నారని, కరోనా సమయంలో వారి సేవలను మరచిపోరాదని, వెంటనే వారి డిమాండ్లను నెరవేర్చాలని కోరారు.

ఎలమ్మతల్లి ఆలయ నిర్మాణానికి విరాళం

రాయికల్: మండలంలోని కొత్తపేటలో ఎల్లమ్మతల్లి ఆలయ నిర్మాణానికి రాయికల్ పట్టణానికి చెందిన బొంగోని భూమాగౌడ్‌-భాగ్యవతి దంపతులు మంగళవారం రూ.55,555 విరాళం అందించారు. .కార్యక్రమంలో సర్పంచ్ బత్తిని రాజేశం, గౌడ సంఘం నాయకులు లింగాల రమేశ్, గుగ్గిళ్ల రవీందర్ గౌడ్ పాల్గొన్నారు.

వాల్మీకి ఆవాసానికి విరాళం

జగిత్యాలజోన్: జిల్లా కేంద్రంలోని అనాథ పిల్లల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న వాల్మీకి ఆవాసం నూతన భవన నిర్మాణం కోసం జగిత్యాల బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాది మారిశెట్టి ప్రతాప్ మంగళవారం రూ. 50 వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆవాసం నూతన భవన కమిటీ కన్వీనర్ డాక్టర్ భీమనాతిని శంకర్, కో-కన్వీనర్ చిత్తారి మధుకర్ పాల్గొన్నారు.

కూచిపూడి కళాకారిణికి సన్మానం

రాయికల్: మండలంలోని రామాజీపేట గ్రామానికి చెందిన బొమ్మకంటి అంజనశ్రీ అనే దివ్యాంగురాలు కూచిపూడిలో రాష్ట్రస్థాయిలో ప్రదర్శిస్తుండగా మంగళవారం పద్మశాలీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోగ వెంకటేశ్వర్లు అంజనశ్రీని ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో జిల్లా పద్మశాలి సంఘం ప్రధాన కార్యద ర్శి వెంకటేశ్ పాల్గొన్నారు.

కమ్మునూర్‌లో యువతి అదృశ్యం

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కమ్మునూర్ గ్రామానికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్సై గౌతంపవార్ కథనం ప్రకారం.. సదరు యువతి సోమవారం కళాశాలకు వెళ్తున్నానని చెప్పి ఇంటికి చేరలేదు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కారాలకు 2024 కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి నరేశ్ తెలిపారు. వివిధ రంగాల్లో 18 ఏళ్ల పిల్లలు సాధించిన అసాధారణమైన ఆవిష్కరణ విద్య విషయక విజయాలు, సామాజిక సేవ, కళలు, సాంస్కృతి, క్రీడలు ధైర్యం వంటి రంగాల్లో విజయం సాధించిన పిల్లలు దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు జగిత్యాల బాలరక్షణ భవన్‌లో సంప్రదించాలని కోరారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

పెగడపల్లి: మండలంలోని సుద్దపల్లిలో కాలువ మల్లయ్య అనే రైతుకు చెందిన పాడి గేదె ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది. బాధితుడి వివరాల ప్రకారం గ్రామ శివారులోని పొలాల సమీపంలో గేదె మేస్తుండగా సమీపంలోనే రక్షణ కంచె లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. గేదె విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు వేడుకున్నాడు.

క్లుప్తంగా

మంత్రిని కలిసిన నేతకాని మహర్ నాయకులు


మంత్రి ఈశ్వర్‌కు బొకే అందిస్తున్న నేతలు

ధర్మపురి: బీఆర్‌ఎస్ అభ్యర్థిగా కొప్పుల ఈశ్వర్‌కు మరోసారి అవకాశం కల్పించడంపై సీఎం కేసీఆర్‌కు నేతకాని మహర్ సంఘం నేతలు కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్యాంపు కార్యాలయంలో మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి బోకేను అందజేశారు. రానున్న శాసనసభ ఎన్నికల్లో ధర్మపురి నియోజకవర్గం నుంచి మరోసారి అవకాశం కల్పించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నేతకాని మహర్ సంఘం నేతలున్నారు.

‘చలో కోకాపేట’ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న పెర్క నాయకులు

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం పెర్కపల్లి గ్రామ శివారులో భాగ్యరాజ్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం రాష్ట్ర పెర్కసంఘం నాయకులు మద్ద లింగన్న, గాండ్ల రాములు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర పెర్క సంఘానికి తెలంగాణ ప్రభుత్వం కోకాపేటలో రెండెకరాల స్థలంతో పాటు, భవన నిర్మాణానికి రూ.2 కోట్లు నిధులు మంజూరు చేశారని, ఈనెల 22న భూమిపూజ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం చలో కోకాపేట పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ మాజీ చైర్మన్ బొడ్డు లక్ష్మణ్, జిల్లా నాయకులు అంకతి గంగాధర్, బాలముకుందం, బొడ్డు బుచ్చన్న పాల్గొన్నారు.

నాయకుల సంబురాలు


స్వీట్లు తినిపిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

జగిత్యాల: బీఆర్‌ఎస్ పార్టీ జగిత్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా సంజయ్‌కుమార్‌ను ప్రకటించడంతో బీర్‌పూర్ నృసింహస్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ప్రదీప్‌రావు ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. స్వీట్లు పంపిణీ చేస్తూ టపాసులు కాల్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మరోసారి భారీ మెజార్టీతో గెలుస్తారన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

రాయికల్: మండలంలోని కుమ్మరిపల్లి గ్రామానికి ఎల్లమ్మగుడి నుంచి వీరాపూర్ గ్రామం వరకు రూ.1.45 లక్షలతో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ రోడ్డు మంజూరు చేయడంతో మంగళవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతలపల్లి స్వప్న, ఉపసర్పంచ్ బొంగు రాజు, ఎంపీటీసీ దొంతి నాగరాజు, వార్డు సభ్యులు తాటిపాముల అంజయ్య, సూర జగన్, ప్రేమలత,జాన్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వాడితే కఠిన చర్యలు


షాపుల్లో తనిఖీ చేస్తున్న అధికారులు

జగిత్యాల: ప్లాస్టిక్ కవర్లు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పలు షాపులను తనిఖీ చేసి మాట్లాడారు. వ్యాపారులందరూ ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని, నిషేధిత ప్లాస్టిక్ వాడొద్దని, రహదారుల వెంబడి చెత్త వేయవద్దని, పట్టణాభివృద్ధికి అందరు సహకరించాలన్నారు. తనిఖీల్లో సిబ్బంది అశోక్, శ్రీకాంత్, చందు, జవాన్ విష్ణు పాల్గొన్నారు.